సాక్షి రంగారెడ్డి

మంగళవారం। 24। డిసెంబర్। 2024



అర్హులకు సంక్షేమ ఫలాలు

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 8లో▸



సేవలను నిర్లక్ష్యం చేయొద్దు

రైతుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేయాలని ఉమ్మడి రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ సత్యయ్య అన్నారు. 8లో▸



మెలకువలు అవసరం

రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయ వర్సిటీ అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు జిల్లాకు ఉప రాష్ట్రపతి

- రెండు రోజుల పాటు కన్హా శాంతి వనంలోనే
- ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్ నారాయణరెడ్డి



అధికారులతో సమావేశమైన కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 25, 26 తేదీల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ కన్హ శాంతి వనంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సోమవారం చేగూరులోని కన్హ శాంతివనంలో కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. అధికారులు తమకు కేటాయించిన విధుల్లో పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



శ్రీపాద్‌నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీపాద్ నాయక్ సోమవారం హైదరాబాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర మంత్రికి శంషాబాద్ విమానాశ్రయంలో షాద్‌నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట నాయకులు విజయ్‌భాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, చేగు సుధాకర్, మహేందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, మిద్దె గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకుంటే ఆస్తుల జప్తు

డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచందర్‌రావు



రైతులకు లీగల్ నోటీసులు అందజేస్తున్న సూర్యచందర్‌రావు

యాచారం: దీర్ఘకాలిక రుణాల వాయిదాలు చెల్లించని రైతులు ఈనెల 30లోగా చెల్లించకుంటే ఆస్తుల జప్తు తప్పదని డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచందర్‌రావు హెచ్చరించారు. సోమవారం ఆయన యాచారం పీఏసీఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఈఓ నాగరాజుతో మాట్లాడి పీఏసీఎస్‌లో దీర్ఘ కాలిక రుణాలు తీసుకుని వాయిదాలు చెల్లించని రైతుల వివరాలు తెలుసుకున్నారు. 700 మంది రైతులు పదేళ్లుగా రూ.10కోట్ల బకాయి చెల్లించలేదని.. నోటీసులిచ్చినా స్పందన లేదని చెప్పారు. అనంతరం చౌదర్‌పల్లి, యాచారం, నందివనపర్తి గ్రామాల్లో పర్యటించి మొండి బకాయి రైతులను కలిసి 30లోగా బకాయిలు చెల్లించాలని సూచించారు. లేదంటే నింబంధనల ప్రకారం ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. పలువురు రైతులకు లీగల్ నోటీసులిచ్చారు. డీసీసీబీ లీగల్ సెక్షన్ అధికారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

దుద్యాల్: 'ఈ ప్రాంత గిరిజనులకు భూములే జీవనాధారం.. అలాంటి పొలాలను లాక్కోవాలని చూశారు.. భూములు ఇవ్వమన్నందుకే వారిపై కేసులు పెట్టి జైలుకు పంపారు' అని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. లగచర్ల ఘటనలో బెయిల్‌పై వచ్చిన రైతులను సోమవారం ఆమెపరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జైలులో ఉన్న మిగిలిన వారిని కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను షరతులు లేకుండా ఎత్తివేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బాధిత రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ విషయాలపై ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని తెలిపారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. జైలులో ఉన్న తమ వారిని విడిపించాలని ఎంపీ డీకే అరుణ కాళ్లమీద పడి వేడుకున్నారు.

ధ్యానంతో ఆత్మజ్ఞానం



కళాకారుల నృత్య ప్రదర్శన

ధ్యాన గురువు పరిణిత పత్రి

- మూడవ రోజు ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ
- అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శనలు



వేడుకు హాజరైన ధ్యానులు



కడ్తాల్: ధ్యానంతో ఆత్మజ్ఞానం పెంపొందించుకోవాలని ధ్యాన గురువు పరిణిత పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు సోమవారానికి మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు సంజయ్ కింగి ఆధ్వర్యంలో ప్రాతఃకాల సంగీత ధ్యానం నిర్వహించారు. అనంతరం పరిణిత పత్రి మాట్లాడుతూ.. ఖనిజ, వృక్ష, జంతురాజ్యం నుంచి మానవుడిగా పరిణతి చెందుతామన్నారు. మన శరీర అభివృద్ధి మాదిరిగానే ఆత్మజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ధ్యానులు వ్యక్తిగత చైతన్యంతో పాటు సామూహిక చైతన్యం పెంపొందించుకోవాలన్నారు. పీఎస్ఎంఎం అంటే స్వేచ్ఛ, కరుణ, స్నేహం, ఆధ్యాత్మిక శాస్త్రమని.. అందరినీ కలుపుకొని వెళ్లడమేనని చెప్పారు. అనంతరం ధ్యాన మహాయాగంలో పత్రీజీ వీడియో సందేశం ద్వారా ధ్యానులకు 'ఐదు వేళ్ల' విశిష్టతపై ధ్యాన సందేశం అందించారు. అనంతరం పలు ఆధ్యాత్మిక పుస్తకాలను, నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి గురువులు ఆధ్యాత్మిక, ధ్యాన సందేశం వివరించడంతో పాటు, వివిధ ప్రాంతాల నుంచి పిరిమిడ్ మాస్టర్లు తమ ధ్యాన అనుభవాలను వివరించారు. బెంగళూర్‌కు చెందిన హయన అకాడమీ కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ధ్యానులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు హనుమంతరాజు, సాంబశివరావు, శ్రీరాంగోపాల్, రాంబాబు, దాట్ల హనుమంత రాజు, బాలకృష్ణ, లక్ష్మీ, దామోదర్‌రెడ్డి, మాధవి తదితరులు ఉన్నారు.

క్రమబద్ధీకరణ అపరిష్కృతం

ఆక్రమిత స్థలాల రెగ్యులరైజేషన్ అంశంపై ఎటూ తేల్చని ప్రభుత్వం



- జిల్లాలో జీఓ 58, 59 కింద 53,823 దరఖాస్తులు
- క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి
- జీఓలను రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆందోళనలో ఫీజులు చెల్లించిన దరఖాస్తుదారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ అంశంపై ప్రభుత్వం ఎటూ తేల్చక లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. ఈ ప్రక్రియకు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు చెల్లించి ఏడాదవుతున్నా.. ఇప్పటి వరకు భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోవడం, చేసినవి సేల్‌డీడ్లు పంపిణీ కాకపోవడం వారు జీర్ణించుకోలేక పోతున్నారు. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయింది. తీరా రిజిస్ట్రేషన్ సమయంలో క్రమబద్ధీకరణలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ జీఓలను రద్దు చేసింది. సమగ్ర విచారణ తర్వాత ఈ అంశంపై ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు అప్పట్లో ప్రకటించింది. అయితే జీఓ రద్దు ప్రకటన చేసి ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు ఆ అంశంపై తుది నిర్ణయం తీసుకోకపోవడంతో స్థలాల క్రమబద్ధీకరణకు అప్పులు చేసి, బ్యాంకుల్లో జమ చేసిన లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు.

రెండు దఫాల్లో అవకాశం

ఆక్రమణ దారుల చేతుల్లో ఉన్న ఎలాంటి వివాదం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు విడతల్లో(తొలుత 2020లో, రెండోదఫా 2022లో) జీఓ నంబర్ 58, 59లను తీసుకొచ్చింది. తొలుత 2014 జూలై 2 కటాఫ్ డేట్ ప్రకటించింది. ఆ తర్వాత 2020 జూలై 2 కటాఫ్ డేట్‌గా ప్రకటించింది. దరఖాస్తుదారు ఇందుకు ఏదో ఒక (ఇంటి నంబర్, కరెంట్ బిల్లు, నల్లాబిల్లు, ఆస్తిపన్ను చెల్లింపు రసీదు) ఆధారాన్ని సమర్పించాల్సిందిగా సూచించింది. జీఓ నంబర్ 58 కింద 120 గజాలలోపు ఇళ్లను ఉచితంగా క్రమబద్ధీకరించింది. ఈ జీఓ కింద మొత్తం 29,807 దరఖాస్తులు రాగా, వీటిలో 7,911 దరఖాస్తులు క్రమబద్ధీకరణకు అర్హత పొందాయి. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత 21,896 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 2,696 మందికి పట్టాలను పంపిణీ చేయగా, మరో 5,215 మందివి పెండింగ్‌లో ఉంది.

రిజిస్ట్రేషన్లు కాక..కట్టిన ఫీజు వెనక్కిరాక

ఇక జీఓ నంబర్ 59 కింద జిల్లా వ్యాప్తంగా 24,016 దరఖాస్తులు రాగా.. వీటిలో 6,801 దరఖాస్తులకు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయింది. వీటిలో 4,705 క్రమబద్ధీకరణకు అనుమతి పొందగా, మరో 1,312 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 2,455 మంది క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించారు. వీరిలో అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి మండలాల్లోనే అత్యధికం ఉన్నారు. అప్పటికే కొంత మందికి రిజిస్ట్రేషన్లు చేసి, డాక్యుమెంట్లను వారి చేతికి ఇవ్వగా, తీరా ప్రభుత్వ ప్రకటనతో మరికొంత మందివి నిలిచిపోయాయి. ఏడాదైనా బ్యాంకుల్లో చెల్లించిన సొమ్ము వెనక్కి రాకపోగా, భూమి తమ పేరున రిజిస్ట్రేషన్ కాకపోవడంతో లబ్ధిదారులంతా ఆందోళన చెందుతున్నారు. వీరితో పాటు ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో అర్బన్ సీలింగ్ భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం 118 జీఓ కింద జారీ చేసింది. ఈ జీఓ కింద ఒక్క ఎల్బీనగర్ నియోజకవర్గంలోనే ఐదు వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికీ ఈ సమస్య అపరిష్కృతంగానే మిగిలిపోవడంతో ఆయా బాధితులంతా ఆందోళన చెందుతున్నారు.

జీఓ నంబర్ 58, 59 కింద వచ్చిన దరఖాస్తులు

మండలం	జీఓ నంబర్ 58	జీఓ నంబర్ 59
అబ్దుల్లాపూర్‌మెట్	4005	7903
ఆమనగల్	114	84
బాలాపూర్	7006	967
చేవెళ్ల	148	60
ఫరూఖ్‌నగర్	22	13
గండిపేట	1716	908
హయత్‌నగర్	2274	2614
ఇబ్రహీంపట్నం	331	626
చౌదరిగూడ	11	37
కడ్తాల్	06	04
కందుకూరు	20	135
కేశంపేట్	10	25
కొందుర్గు	16	04
కొత్తూరు	19	95
మాడ్గుల	03	13
మహేశ్వరం	405	180
మంచాల	41	82
మొయినాబాద్	43	203
నందిగామ	06	07
రాజేంద్రనగర్	2142	531
సరూర్‌నగర్	3228	2234
శేరిలింగంపల్లి	7830	5834
షాబాద్	07	02
శంషాబాద్	120	149
శంకర్‌పల్లి	199	1094
తలకొండపల్లి	44	109
యాచారం	41	77

దస్త్రాలు మాయం?

జీఓ నంబర్ 58, 59లను అడ్డుపెట్టుకుని అప్పటి ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలు ఖరీదైన ప్రభుత్వ భూములను కొల్లగొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలంతా అసెంబ్లీ ఎన్నికల హడావుడిలో ఉండగా, ఇందుకు ఒక రోజు ముందే గోపన్‌పల్లి సర్వే నంబర్ 74లో 12,879 గజాల స్థలాన్ని 30 మంది పేరున క్రమబద్ధీకరించారు. నానక్‌రాంగూడ సర్వే నంబర్ 149లో ఐదు ఎకరాల భూమిని 15 మంది పేరిట క్రమబద్ధీకరించారు. అదే రోజు రియల్ ఎస్టేట్ సంస్థల పేరున కన్వేయన్స్ డీడ్‌లు కావడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. ఈ అంశంపై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. సంబంధిత దస్త్రాలన్నీ మాజీ అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి వద్దకు పంపింది. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయన అవినీతి కేసులో అరెస్ట్ కావడం తెలిసిందే. ఇక్కడ మూడు దఫాలుగా స్థలాల క్రమబద్ధీకరణ జరగడం, ప్రస్తుతం తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టరేట్‌లోనూ ఈ కీలక దస్త్రాలు లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణికి 92 అర్జీలు

- ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 92 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖకు 57, పీడీ హౌసింగ్ 19, డీపీఓ ఏడు, లోకల్ బాడీ మూడు, ఎంపీడీఓ ఒకటి, శేరిలింగపల్లి మున్సిపాలిటీకి ఒకటి, ఏడీ సర్వే ల్యాండ్ రెండు, ఎంప్లాయిమెంట్, వైద్యారోగ్య శాఖకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందాయని చెప్పారు. వీటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్మినేడు భూ బాధితులకు న్యాయం

ఎల్మినేడులో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్ కార్యాలయంలో రైతులతో సమావేశమై వివరాలు సేకరించారు. భూ ముల లెక్కలు తప్పుగా చూపారని ప్రతీ గుంటకు పరిహారం చెల్లించాలని రైతులు కోరారు. స్పందించిన కలెక్టర్ 2013 భూ సేకరణ చట్టంప్రకారం పరిహారం పాటు ఎకరాకు 200గజా ల ప్లాటు ఇస్తామన్నారు. భూములు తక్కువ గా వచ్చిన రైతులకు సంబంధించిన భూములను మరోసారి సర్వే చేసి పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఎన్ఆర్ ప్యాకేజీ ఇస్తామన్నారు. భూ బాధితుల సంఘం నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ జి ల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, రవి, మహేందర్, శ్రీశైలం, జంగయ్య పాల్గొన్నారు.

28 నుంచి విద్య, వైజ్ఞానిక మహాసభలు



కందుకూరు: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్

కడ్తాల్/కందుకూరు: టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆరవ విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన కడ్తాల్, కందుకూరు జెడ్పీహెచ్ఎస్‌లలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. ఈ నెల 28, 29, 30 తేదీల్లో నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రతీ రెండేళ్లకు ఒకసారి ఈ మహాసభలను రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభల్లో ప్రభుత్వ విద్యారంగంపై మేధావులతో లోతైన చర్చ, ఉపాధ్యాయుల అభ్యున్నతికి సూచనలు సలహాలు అందిస్తారని చెప్పారు. ఈ మహాసభలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కడ్తాల్, కందుకూరు మండల అధ్యక్షులు జంగయ్య, రవి, కందుకూరు మండల ప్రధానకార్యదర్శి డాక్టర్ జె.బుగ్గరాములు, సంఘం నాయకులు కౌసల్య, మల్లయ్య, భాగ్యలక్ష్మి, జనార్ధన్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, సునీత, శ్వేత, ఈశ్వర్, బక్యానాయక్, జైపాల్, శ్రీనివాస్ రావు, స్టాన్లీ, కడ్తాల్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అంజయ్య, కవిత, గోవర్ధన్‌రెడ్డి, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య పనితీరు భేష్

అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



డెయిరీ నిర్వాహకురాలిని సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

నందిగామ: మహిళలు స్వయం ఉపాధితో పాటు సొంత వ్యాపారాలతో ఆర్థికంగా బలపడాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చేగూరు, అంతిరెడ్డిగూడ గ్రామాలలో మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ ఎంబ్రాయిడరి, డెయిరీ పార్లర్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో జీవనోపాధి పొందాలని సూచించారు. కేవలం ఇంటికి మాత్రమే పరిమితం కాకుండా ప్రభుత్వం ఇచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. మహిళ సమాఖ్య పని తీరుకు కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీలత, డీపీఎం బాల్‌రాజ్, ఏపీఎం యాదగిరి, మాజీ ఎంపీటీసీ కుమార్ గౌడ్, సీసీలు అరుణ, రజని, సమాఖ్య సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి రైతే వెన్నెముక

- సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్



రైతులకు అవగాన కల్పిస్తున్న రత్నాకర్

షాబాద్: వ్యవసాయ రంగానికి రైతే వెన్నుముక అని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో భారతీయ నూనె గింజల సంస్థ రాజేంద్రగనర్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం భవిష్యత్ అభివృద్ధిపై వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలపై దృష్టి సారించాలన్నారు. నూనె గింజల సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై, కూరగాయలు, వరి సాగు, పాడి పరిశ్రమపై రైతులకు వ్యవసాయ రంగంలో అత్యున్నత సేవలు అందిస్తున్న రైతులను గుర్తించి వారి కృషిని ప్రోత్సహించాలన్నారు. సుస్థిర వ్యవసాయం, సాంకేతిక పద్ధతుల ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ నూనె గింజల సంస్థ టెక్నీషియన్ నందీశ్వర్, మధుసూదన్‌రెడ్డి, చంద్రారెడ్డి, మాధవరెడ్డి, నరసింహారెడ్డి, మల్లారెడ్డి, మల్లయ్య, బొబ్బిగామం, తిర్మలాపూర్ గ్రామల రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవలను నిర్లక్ష్యం చేయొద్దు

- అవసరమైన వారికి కొత్త రుణాలు మంజూరు చేయండి
- ఉమ్మడి రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ సత్యయ్య



పాంబండపై డీసీసీబీ చైర్మన్ సత్యయ్యను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి

కుల్కచర్ల: రైతుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేయాలని ఉమ్మడి రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ సత్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయం, ది హైదరాబాద్ సహకార బ్యాంక్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు అందించాలని సూచించారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావీయకూడదన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. అవసరమైన వారికి కొత్త రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు.

రామలింగేశ్వరస్వామికి పూజలు

బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం ఆహ్లాదకరంగా ఉందని, ప్రతీ పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ వేడుకకు హాజరు కావాలని కోరారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, అర్చకులు పాండుశర్మ, సహకార సంఘ సిబ్బంది, ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు అవసరం



పంటల సాగుపై రైతులకు సలహాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే లాభాలు ఆర్జించవచ్చునని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా వారు దత్తత తీసుకున్న మల్లాపూర్‌లో సోమవారం రైతులతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలకు చెందిన పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. పంటల్లో చీడపీడల నియంత్రణకు రసాయన మందులను వాడొద్దని సూచించారు. దీంతో భూ సారం కోల్పోవడంతో పాటు రైతులు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. సేంద్రియ ఎరువులతో చీడపీడలను నియంత్రించవచ్చన్నారు. పంటల సాగుకు ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లావణ్య, ప్రద్మశ్రీ, ప్రమీల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత విశ్వకర్మ సంఘం జిల్లా కమిటీ



నియామకపత్రం అందుకుంటున్న విశ్వకర్మ సంఘం నాయకులు

కందుకూరు: అఖిల భారత విశ్వకర్మ జిల్లా కమిటీని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండోజు గంగాధర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ప్రకటించిన జిల్లా కమిటీలో అధ్యక్షుడిగా దంతోజు కరుణాకర్, గౌరవ అధ్యక్షుడిగా డి.సురేశ్, కార్యదర్శిగా రమేశ్‌చారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణుల హక్కులు, సంక్షేమానికి కలిసికట్టుగా పని చేస్తామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



షాద్‌నగర్ రూరల్: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుశీల తెలిపిన ప్రకారం.. పట్టణంలోని పటేల్‌రోడ్డులోని మసీద్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(48) అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనాస్థలికి వెళ్లి విచారించగా మృతుడి ఆచూకీ తెలియరాలేదు. మృతుడు భిక్షాటన చేస్తుండేవాడని స్థానికులు చెప్పారు. మృతుడు లైట్‌బ్లూ టీషర్ట్, చాక్లెట్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులుంటే 8712663329 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు దాటుతుండగా..

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి



వెంకటేశ్(ఫైల్)

షాద్‌నగర్ రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన సొన్నాయిల వెంకటేశ్(42), విజయ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు షాద్‌నగర్ పట్టణంలో కొత్తగా ఇల్లు కొనుగోలు చేశారు. ఇంటి పనులు చూసుకునేందుకు దంపతులు పట్టణానికి వచ్చారు. సాయంత్రం వెంకటేశ్ టీ తాగేందుకు నడుచుకుంటూ వెళ్లి తిరిగి వస్తుండగా.. పట్టణ కూడలి నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న డీసీఎం ఆయన్ను బలంగా ఢీకొట్టింది. డ్రైవర్ వాహనంతో సహా అంతే వేగంతో పరారయ్యాడు. వెంకటేశ్ తలకు బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అనంతరాములు తెలిపారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు

- ఓర్వలేకే ప్రతిపక్షాల ఆరోపణలు
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు: కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని రైతువేదిక భవనంలో, తలకొండపల్లి మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందన్నారు. హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వివరించారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందించేందుకే కుటుంబ సర్వే నిర్వహించామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అర్హులను గుర్తిస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని.. వాటిని తిప్పికొట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, తలకొండపల్లి తహసీల్దార్ నాగార్జున, డిప్యూటీ తహసీల్దార్ సంతోశ్, ఎంపీడీఓ శ్రీకాంత్, సింగిల్ విండో చైర్మన్ కేశవరెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జగన్, ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీశైలం పాండురంగయ్య, రమేశ్‌గౌడ్, తహసీల్దార్ లలిత తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు అంజయ్యగుప్తా, అజీం, వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు భూమిపూజ

కడ్తాల్: మండల పరిధిలోని ముక్తమాదారంలో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ముక్తమాదారం–నాగిరెడ్డిగూడ తండాల మధ్య రూ.1.20 కోట్లతో, 1.5 కిలో మీటర్ల వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తహసీల్దార్ ముంతాజ్ అధ్యక్షతన 31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కడ్తాల్ మండల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని.. అదనంగా మరో 1,000 ఇళ్ల మంజూరుకు కృషి చేస్తున్నాని తెలిపారు. ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములుగౌడ్, నాయకులు రామకృష్ణ, అశోక్, రాజేశ్, రవి, యాదగిరిరెడ్డి, మల్లేశ్‌గౌడ్, లక్పతినాయక్, షాబుద్దీన్, ఇమ్రాన్, జహంగీర్‌అలీ, జహంగీర్‌బాబా, హీరాసింగ్, శ్రీకాంత్, భిక్షపతి, రాంచందర్ ఉన్నారు.

శత వసంతోత్సవాలను జయప్రదం చేయాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

- సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య
- వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

మహేశ్వరం: సీపీఐ వంద వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం మహేశ్వరంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వందేళ్ల ఉద్యమ పార్టీగా సీపీఐ ఖ్యాతి పొందిందన్నారు. పేద ప్రజలు, రైతులు, కార్మికుల పక్షాన ఎన్నో ఉద్యమాలు చేసి అప్పటి ప్రభుత్వాల మెడలు వంచి, వారి సమస్యలు పరిష్కరించిందన్నారు. స్వాతంత్ర్య, కార్మిక ఉద్యమాల్లో సీపీఐ చురుగ్గా పని చేసిందని తెలిపారు. పీడిత వర్గాల పక్షాన ఎన్నో పోరాటాలు చేసిన ఘనత పార్టీకి ఉందన్నారు. సీపీఐ వందేళ్ల వేడుకల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.దత్తునాయక్, మండల కార్యదర్శి పల్లాటి యాదయ్య, నాయకులు దేవేందర్, రమేశ్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తమ్ముడిని చంపిన అక్కకు యావజ్జీవం

రూ.5 వేలు జరిమానా



అరుణమ్మ(ఫైల్)

షాబాద్: ఆస్తి కోసం తోడబుట్టిన తమ్ముడిని చంపిన (అక్కకు) నేరస్తురాలికి కోర్టులో యావజ్జీవ జైలు శిక్ష పడింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామానికి చెందిన అమ్మాపూరం బాల్‌రాజ్‌కు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఆస్తిలో తనకూ వాటా కావాలని అక్క అరుణమ్మ 2014లో చేసిన దాడిలో అతడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు అరుణమ్మను రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో సోమవారం ఎల్‌బీనగర్ సెషన్స్ కోర్టులో నేరస్తురాలికి యావజ్జీవ జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

తండ్రీకొడుకుల అదృశ్యం



సత్తార్



షానవాజ్

పహాడీషరీఫ్: కుటుంబ కలహాల కారణంగా తండ్రీకొడుకులు అదృశ్యమయ్యారు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు సోమవారం తెలిపిన ప్రకారం.. పదేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన షహజాది బేగం, అబ్దుల్ సత్తార్(55) కుటుంబం ఆసీఫ్‌నగర్‌కు వలస వచ్చారు. గతనెల జల్‌పల్లి శ్రీరాం కాలనీకి మకాం మార్చారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. అబ్దుల్ సత్తార్ తరచూ అప్పులు చేస్తున్న క్రమంలో ఈ నెల 19న దంపతులు, కుమారుడు షానవాజ్(20)ల నడుమ గొడవ జరిగింది. అనంతరం పనికి వెళుతున్నామని ఇంట్లో నుంచి ఎవరికి వారు వెళ్లగా.. సత్తార్, షానవాజ్ తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా వారి జాడ దొరకలేదు. దీంతో షహజాది బేగం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

అదృశ్యమైన మహిళ మృతి



సంతోష(ఫైల్)

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఫాతిమాపూర్‌లో ఈ నెల 22న అదృశ్యమైన ఓ మహిళ గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో పడి మృతి చెందిన విషయం సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఫాతిమాపూర్ గ్రామానికి చెందిన దండుగుల సంతోష(28) ఈ నెల 19 నుంచి కనిపించడం లేదని ఆమె బంధువు శాంతమ్మ 22న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తుండగా గ్రామ సమీపంలోని గోధుమకుంట చెరువులో ఓ మహిళ మృతదేహం ఉందని సమాచారం అందింది. దీంతో పోలీసులకు అక్కడకు చేరుకుని శవాన్ని బయటకు తీసి బంధువులకు సమాచారం ఇవ్వగా సంతోషగా గుర్తించారు. కాగా మృతురాలు పలువురితో సహజీవనం చేసి ఏడాది కాలంగా ఒంటరిగా జీవనం కొనసాగిస్తోంది. ఆమెకు మూడేళ్ల కుమారుడున్నాడు. కొన్ని రోజులుగా ఆమె టీబీ వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల ఆమె పనిచేస్తున్న యజమాని సుధాకర్‌రెడ్డితో తరుచుగా చనిపోతానని చెప్పిందని వివరించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బడంగ్‌పేటలో 'హైడ్రా' పర్యటన

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ కేంద్రంలో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. నాలాలు, ఓపెన్ స్థలాలు, పార్కుల కబ్జాలపై ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో సోమవారం కార్పొరేషన్ పరిధిలో పర్యటించారు. మునిసిపల్ కాలనీ, మారుతీనగర్, ఎంసీఆర్ కాలనీ, గాయత్రిహిల్స్, బాలాజీనగర్, బడంగ్‌పేట మెయిన్‌రోడ్డులో నాలాలపై వెలసిన నిర్మాణాలను పరిశీలించారు. నివేదిక ఆధారంగా త్వరలో చర్యలు తీసుకుంటామని హైడ్రా ఇన్స్‌పెక్టర్ తిరుమలేశ్ తెలిపారు.

నకిలీ ఫోన్ పే యాప్‌తో మోసం

యువకుడిపై చీటింగ్ కేసు నమోదు

కుల్కచర్ల: నకిలీ ఫోన్ పే యాప్‌తో మోసం చేస్తున్న యువకుడిపై చీటింగ్ కేసు నమోదైంది. ఈ ఘటన సోమవారం కుల్కచర్ల పీఎస్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గోరిగడ్డతండా అనుబంధ గ్రామమైన అంతిగానికుంటకు చెందిన కాట్రావత్ వినోద్ సోమవారం కుల్కచర్లలోని ఓ బంక్ వద్దకు వెళ్లి రూ.400 పెట్రోల్ పోయించుకున్నాడు. డబ్బులు సెండ్ అయినట్లు తన ఫోన్ పేను చూపించాడు. అయితే డబ్బులు తమకు క్రెడిట్ అయినట్లు సౌండ్ రాకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది అతన్ని పట్టుకుని పీఎస్‌లో అప్పగించారు.పోలీసులుగట్టిగా బెదిరించడంతో.. అది నకిలీ ఫోన్ పే యాప్ అని ఒప్పుకొన్నాడు. ఇంతకు ముందు రెండుసార్లు కూడా ఇలాగే పెట్రోల్ వేయించుకుని వెళ్లానని అంగీకరించాడు.ఇలాంటి మోసాలతో తమ బంక్‌కు రూ.50 వేల నష్టం వాటిల్లిందని, బంక్ నిర్వాహకులు ఫిర్యాదు చేయడంతో యువకుడిపై కేసు నమోదు చేశారు.

టెలిగ్రాం ద్వారా లింక్

హైదరాబాద్, పూణేలో కూలీ పనులు చేసుకునే వినోద్ ఇరవై రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. తనకు తెలిసిన వారి నుంచి టెలిగ్రామ్ ద్వారా రూ.250 చెల్లించి నకిలీ ఫోన్ పే యాప్ తీసుకున్నాడు. పలుమార్లు పరిశీలించుకుని ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ తరహా యాప్ పొందిన వారు మండలంలో ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

ముగ్గురు బీటెక్ విద్యార్థుల అదృశ్యం

- గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆలస్యంగా వెలుగులోకి..
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: వారం రోజుల్లో ముగ్గురు బీటెక్ విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలోని గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలు సోమవారం ఆలస్యంగా వెలుగుచూశాయి. మిస్సింగ్ అయిన వారిలో ఇద్దరూ మైనర్ విద్యార్థులు కావడం గమనార్హం. స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం రాంనాథ్‌గుడపల్లికి చెందిన కొత్తగాడి బాల్‌రాజ్ కుమారుడు (17) ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థల్లో బీటెక్ (సీఎస్‌సీ) ప్రథమ సంవత్సరం చదువుతూ కాలేజ్ హాస్టల్‌లో ఉంటున్నాడు.14న హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. తండ్రి బాల్‌రాజ్ విష్ణుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో మరుసటి రోజు నేరుగా కాలేజ్‌కి వచ్చి ఆరా తీయగా.. సిబ్బంది నిర్లక్ష్యంగా మాట్లాడారని ఆరోపించారు. ఇదిలా ఉండగా యాదాద్రి జిల్లా ఆత్మకూర్ మండలం, కాప్రాయిపల్లికి చెందిన మరో విద్యార్థిని(17) గురునానక్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ ఇదే కళాశాల హాస్టల్ ఉంటోంది. ఈ నెల 17న సాయంత్రం 6 గంటల నుంచి కనిపించకుండా పోయింది. అలాగే వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన 19 సంవత్సరాల విద్యార్థిని ఈనెల 20న అదృశ్యమైంది. ఈమె కూడా కాలేజ్ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. వారం రోజుల్లో ముగ్గురు విద్యార్థులు అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కానీ యాజమాన్యం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాలేజీ నిర్వాహకులు, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు. అయితే తమ పిల్లల ఆచూకీ కనుగొనడంలో పోలీసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

చెడ్డీ గ్యాంగ్ వీరంగం

తాళం వేసిన ఇంటికి కన్నం

- 20 తులాల బంగారు ఆభరణాలు చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పట్టణ సీఐ విజయకుమార్

షాద్‌నగర్ రూరల్: గతంలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన చెడ్డీ గ్యాంగ్ మళ్లీ రెచ్చిపోతోంది. తాళం వేసిన ఇంటికి కన్నం వేసి 20 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన సోమవారం పట్టణంలోని విజయనగర్‌కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు.. శ్రీనివాస్‌రెడ్డి అనూష దంపతులు పట్టణంలోని విజయనగర్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. కాగా శ్రీనివాస్‌రెడ్డి రోజుమాదిరిగానే కొత్తూరు మండలం తిమ్మాపూర్ సమీపంలోని విస్సబయో పరిశ్రమలో విధులకు వెళ్లాడు. ఆయన భార్య అనూష తాళం వేసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లింది. చెడ్డీ, బనియన్ వేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి సాయంత్రం ఇనుపరాడ్డుతో కాలనీలోకి ప్రవేశించాడు. అక్కడే కూర్చున్న వృద్ధురాలు అనంతమ్మ ఎవరు నువ్వు అని ప్రశ్నించడంతో అక్కడ నుంచి వెళ్లిపోయి శ్రీనివాస్‌రెడ్డి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో 20 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. విధుల నుంచి వచ్చిన ఆయన ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడేసి ఉండడం గమనించి బీరువాను పరిశీలించగా ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం రప్పించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్‌గా రమేశ్



నియమాక పత్రంను అందుకుంటున్న రమేశ్

కేశంపేట: ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్‌గా మండల పరిధిలోని కాకునూర్‌కు చెందిన సీమల రమేశ్ నియమితులయ్యారు. సోమ వారం నగరంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ రమేశ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఉద్యమంలో పాల్గొన్న జిల్లా వాసులను ఏకతాటిపైకి తీసుకువస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, దయానంద్, నరసింహాచారి, భూపాల్, రాంబాబు, తాడూరి గగన్ కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.